# రాజధాని ఎక్స్‌ప్రెస్



## మైథిలీ వెంకటేశ్వరరావు

తెలుగులోనే కాదు మరే ఇతర భాషల్లోనూ
రాని మొట్టమొదటి బ్రైన్ కిడ్నాప్
నవలని మీరిప్పుడు చదువుతున్నారు

**రాజధాని ఎక్స్‌ప్రెస్**

By

**మైథిలీ వెంకటేశ్వరరావు**

**ధర: రూ. 90/-**

**ముద్రణ :**

**మార్చి 2008**

**పబ్లిషర్స్:**

**G. VENKATESWARA RAO**

D.No : 28-23-21, Arundelpet,
Kaza Venkateswararao Street,
VIJAYAWADA - 520 002.

# ప్రారంభం :

హైద్రాబాద్....

భారతదేశానికి చెందిన రాష్ట్రాల్లోని ఆంధ్రప్రదేశ్‌కి చెందిన రాజధాని నగరం కాదు 7,96,095 చ.కి.మీ దేశానికి చెందిన పొరుగు దేశంలోని ఓనగరం.

అప్పటికింకా వెలుగురాలేదు. ఇంకా చీకట్లూ, మంచూ పెనవేసుకొని వున్నాయి. రోడ్ల మీద జనంకూడా లేరు. ఉదయాన్నే వాకింగ్ కెళ్ళే ఒకటీ అరా మనష్యులు తప్ప...

ఆ విశాలమైన రోడ్డుమీద ఇద్దరు వ్యక్తులు తాపీగా నడుచుకుంటూ వస్తున్నారు... చాలా చిన్నగా మాట్లాడుకుంటున్నారు. చలిగాలి చల్లగా తగులుతోంది. అయితే వారు బలమైన ఉన్ని కోట్లు ధరించి వున్నారు.

వారి ముఖాల్లో రౌద్రం, రాక్షసత్వం కొట్టొచ్చినట్లు కనపడుతున్నాయి. ఇరవైమంది పసిపిల్లలని చంపాల్సిన అవసరం వస్తే ఆలోచించకుండా రివాల్వర్‌కి పని చెప్పే కరుకుతనం కనపడుతుంది. అలా అని వారు క్రిమినల్స్ కాదు...

అలాంటి ఆ యిద్దరిలో, హుందాగా రెండు చేతులూ జేబులో పెట్టుకున్న అతను అడిగాడు.

“అసలు నువ్వు, ఈ పని చెయ్యగలవా?”

“అనుమానమా?” ఇద్దరూ ఊర్దూలో మాట్లాడుకుంటున్నారు.

“అని కాదు, నాకెక్కడా అవకాశం కనపడటం లేదు. వారంతా విమానాలు ద్వారానే ప్రయాణిస్తున్నారు. దుర్భేధ్యమైన సెక్యూరిటీతో”

“నో సర్! ఒకే ఒకచోట... కేవలం, ఒక్కచోట మాత్రమే వారు ట్రైన్‌లో ప్రయాణిస్తున్నారు”.

“నిజమే కాని ఆ ట్రైన్‌లో ఉన్న సెక్యూరిటీ, వారివద్ద ఉన్న ఆయుధ సంపత్తి, అవన్నీ ఆలోచించు, సెక్యూరిటీ సిస్టమ్‌లో ఎక్కడా లొసుగులేదు...” వెళ్ళుతున్న రైలుని పేల్చటానికి కూడా అవకాశం లేదు.. పైగా అలా చేస్తే ఉపయోగం కూడా లేదు...

"కరెక్ట్ సార్! కాని మనం ఆ వైపుగా ప్రయత్నించం మరో వైపుగా" ఆయన ఆగారు... సూటిగా రెండో అతని వంక చూశాడు.

"యస్ సార్ చరిత్రలో ఇంతవరకూ ఎవ్వరు చెయ్యని విధంగా ప్లాన్ చేశాను. ఏ టెర్రరిస్టు గ్రూపులుగాని, ఏ మేధావి ఆలోచించలేని అద్భుత పథకం..." అని అటూ ఇటూ చూసి వంగి చెవిలో చెప్పాడు.

వింటున్న అతని ముఖం వెలిగిపోయింది.

"అది సాధ్యమా ?" "ఒక పటాన్ తల్చుకుంటే సాధించలేనిది సృష్టిలో లేదు"."అయితే నీకేమి కావాలి..."

"చాలా పట్టాలూ, స్లీపర్సు బదులుగా వాడే చెక్క మోల్డింగులు గేజు సరిచూసుకునే పరికరాలు... ఇంకా, చాలా" " అవన్నీ ఇక్కడ్నించి అక్కడికి"

"కాదు సార్. ఖర్చు గురించి నేను చెప్పేది. కోట్ల రూపాయల వ్యవహారం"

"ష్... బ్లడీ మని. డబ్బుకంటే పరువు ముఖ్యం... అటూ, ఇటూ తేడా వచ్చిందంటే మనదేశ పరువు మట్టిలో కలిసి పోతుంది అది జరగకూడదు. ఆ దేశంలో మనం అనుకున్నది జరగాలి. ప్రపంచ దేశాలన్నీ ఆ దేశాన్ని తప్పుపట్టాలి. వారి మీదే అనుమానపడాలి..."

"నాదేశం కోసం, ఈ గడ్డమీద పుట్టిన ఈ శరీరం ప్రాణమయినా వదులుతుందిసార్." ఆయన అభినందనగా భుజం తట్టాడు. ఫాలో అవుతున్న జీప్‌కేసి చేయి చూపించి రమ్మని సైగ చేశాడు మొదటి వ్యక్తి....

ఆయన చెయ్యి ఎత్తడం ఆలస్యం, వాళ్ళనే గమనిస్తున్న జీప్ డ్రైవర్ వాహనాన్ని స్టార్ట్ చేసుకొని వారి పక్కగా ఆపాడు.

మొదటి అతను హుందాగా లోపలికెక్కుతూ– "మళ్ళీ మన కలయిక ఇస్లామాబాద్‌లో జాగ్రత్త.... నీ ఫేస్ లీక్ కాకూడదు..."

"ఓ.కె. సార్" తలొంచాడు. జీప్ ముందుకు కదిలింది. వెళ్ళుతున్న జీప్ మీద గవర్నమెంట్ వెహికల్ అని మాత్రం రాసి వుంది. దానిక్రిందే హైల్త్ డిపార్టుమెంట్ అనికూడా వుంది. నిజానికా జీప్ పాక్ ఇంటలిజెన్స్‌కి చెందినది.

# రాజధాని ఎక్స్‌ప్రెస్

## హోటల్ చోళాషెరటాన్

సూట్‌నెంబర్ వన్ నాట్ వన్ నిశ్శబ్దంగా వుంది. అలా అని గదిలో ఎవరూ లేరనుకుంటే పొరపాటే... ముగ్గురే ముగ్గురు వున్నారు.

ముగ్గురూ ఆడవాళ్ళే...

అందరూ ఇరవైయేళ్ళ వయస్సులో వున్న ముగ్ధలే... ప్రస్థుతం వారు మాటిమాటికి డోర్ కేసి చూస్తున్నారు. మధ్య మధ్యలో చేతులకున్న వాచెస్ కేసి చూసుకుంటున్నారు.

పన్నెండు.. సరిగ్గా అర్థరాత్రి పన్నెండు-

అప్పుడయ్యింది అలికిడి... డోర్ దగ్గిర-

కూర్చున్న ముగ్గురి అతివల్లో కలవరపాటు సర్ధుకు కూర్చున్నారు.. వారి కళ్ళల్లో ఏదో ఉద్వేగం...

డోర్ తెరుచుకొని లోపలికి ప్రవేశించాడో దృఢకాయుడు- నలభై యేళ్ళుంటాయి. మొహంలో క్రౌర్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

అతన్ని చూడగానే ముగ్గురూ లేచినిలబడ్డారు భయంగా,

అతను ముగ్గురిని దీక్షగా చూశాడు. ముగ్గురూ చీరల్లోనే ఉన్నారు. అసలు చీరిచ్చినంత సెక్సీ ఫీలింగ్ మరే డ్రస్ ఇవ్వదు. అందుకే వాళ్ని మోడరన్ డ్రస్ వదిలేసి చీరల్లో రమ్మని చెప్పింది.

అతను వారికెదురుగా కూర్చున్నాడు. టేబుల్ మీదున్న క్యింగ్‌మాన్ సిగరెట్ ప్యాకెట్ తీసుకొని లైటర్‌తో వెలిగించుకున్నాడు.

ఆలలనలు ముగ్గురూ కన్నార్పకుండా చూస్తున్నారు. అతను ముగ్గురిని పరిశీలనగా చూసి తృప్తిగా తల పంకించాడు.

‘‘గుడ్ వెరీగుడ్ లేడీస్– బావుంది. మీరూ, మీ డ్రెస్‌లూ... మగాడనేవాడెవడూ మిమ్మల్ని చూస్తే గుక్క తిప్పుకోలేడు, వాడు ప్రవరాఖ్యుడయినా సరే...’’

ఆడవాళ్ళ మొహాల్లో అతిశయం... ముగ్గురూ పమిటలు సవరించుకున్నారు.

“మీరింతవరకూ పదివేలకి, ఇరవైవేలకి కక్కుర్తిపడి ఫైవ్ స్టార్ హోటళ్ళలో నలుగుతున్నారు ఆ డబ్బుమీ శరీరానికేగాని, మీ అందానికి కాదు.. ఆ ఆందంతో లక్షలు సంపాదించవచ్చు పడుకుని కాదు, నేను చెప్పిన చిన్న పని చేస్తే–”

“చెప్పండి సర్...” కోరస్‌గా అన్నారు. డబ్బనగానే వారిలో నూతనోత్సాహం వచ్చింది... లక్షలనగానే ఆశ తన్నుకొచ్చింది. ముగ్గురి కళ్ళు మెరుస్తున్నాయి.

“అది చెప్పటానికే మిమ్మల్ని పిలిపించింది.

ఈ స్టార్ హోటల్‌లో రూం బుక్ చేయించింది. కాని ఒక్క విషయం. నా గురించి తెలుసుగా...”

ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. తెలుసునన్నట్లు తల ఆడించారు.

“తెలీదని నేననుకోవటం లేదు– అయినా చెబుతున్నాను నేనిప్పటి వరకూ ఎన్ని హత్యలు చేశానో గుర్తులేదు. మరెన్ని రేప్‌లు చేశానో మాత్రం గుర్తుంది. ఇరవైమందిని... చెప్పిన పని చెప్పినట్టుగా చేయకుండా నాకు మస్కాకొట్టిన ఇరవై మంది యువతులని రేప్‌చేసి రేప్ చేయించి మరీ చంపాను...”

లేడీస్ ముగ్గురి నుదుటన చెమట పట్టింది. గుటకలు మ్రింగారు–

“ముందు టవల్‌తో ముఖాలు తుడుచుకోండి... అయినా ఏసిలో చెమటెందుకు పడుతుందో నాకర్థం కావటం లేదు.

ఆ విషయం వదిలేస్తే చెప్పండి. చెప్పిన తరువాత వెనుకడుగు వెయ్యకూడదు అలా వేశారంటే వెళ్ళేది బయటికి మీరు కాదు... మీ శరీరాలు... ప్రాణం లేని శరీరాలు.”

"నో... చెప్పండి..." టక్కున అందో అమ్మాయి.

"మీ ముగ్గురూ ఆలోచించుకోండి ఇందులో బలవంతమేమీలేదు. కాదంటే మేము చెయ్యమంటే సగౌరవంగా బయటికి పంపిస్తాను. మీ రాత్రి రేటు మీకిచ్చి మరీ పంపిస్తాను. నా దగ్గర తేడా రాదు... రహీమ్ మాటంటే మాటే."

"లేదు... ఇందాక వచ్చాక వెనక్కి అడుగువెయ్యం. డబ్బు చాలా ముఖ్యం... అవసరం!"

"ప్రపంచంలో దానితో అవసరం ముఖ్యం కానివారు ఎవరూ వుండరు. వినండి! రేపు మీరున్న చోటికి తలా లక్ష రూపాయలు అందచేయబడతాయి. ఆ తర్వాత మీరు చెయ్యాల్సింది- తెనాలి వెళ్ళటం.... మేం చెప్పిన డేట్‌కి రాజధాని ఎక్స్‌ప్రెస్‌కి మారు పేర్లతో రిజర్వేషన్ చేయించుకొని ఆ ట్రైన్ ఎక్కటం."

"తెనాలా?" ఆశ్చర్యంగా అడిగిందో అమ్మాయి.

"అవును మద్రాస్ నుంచి వచ్చిన రాజధాని ఎక్స్‌ప్రెస్ అక్కడ రెండు నిమిషాలు మాత్రమే ఆగుతుంది. మొత్తం ఇరవై ఆరు కంపార్టుమెంట్స్‌కి చివరా, మధ్యలో రెండు గార్డ్ పెట్టెలుంటాయి.

ఆ రెండు గార్డ్ పెట్టెల్లో రైలు కదులుతుండగా ఎక్కాలి. గార్డ్స్‌కి అనుమానం రాకూడదు. ట్రైన్ బయలుదేరే హడావుడిలో ఎక్కారులే అనుకోవాలి! ట్రైను విజయవాడదాకాఆగదు! ఈలోగా మీ చాతుర్యం చూపాలి. మిమ్మల్ని, మీ అందాన్ని తప్ప ఆ గార్డ్స్‌కి మరొక దానిమీదకు ధ్యాస మళ్ళ కూడదు అది కూడా వెంటనే జరగాలి."

"ఆఁ తర్వాత!?"

"అంతే మీ పని అయిపోతుంది... దట్సాల్."

"అంతేనా?" తేలికగా అందో అమ్మాయి.

రహీమ్ మూడో ఆమెవైపు తిరిగాడు.

"ఇక నువ్వు చెయ్యాల్సినపని... వీరిద్దరూ వెళ్ళగానే నాతో వుండటం. ఈ రాత్రికి నాకు స్వర్గం చూపటం..."

ఆమె నవ్వేసింది!

ఇద్దరూ లేచి నిలబడ్డారు!

"ఇంతకీ ఏ రోజో చెప్పలేదు."

"ఆ వివరాలు మీకు లక్షతో పాటు అందజేయబడతాయి."

"ఆ యిద్దరూ వెను తిరగబోతూండగా పిలిచాడు... వారు ఆగారు."

"మీ అందం ఆ గార్డ్సుని లొంగదీయలేదనుకో యేం చేస్తారు?"

ఇద్దరూ అయోమయంగా చూశారు!

"ట్రైన్ ఎక్కేటప్పుడు మీ బ్యాగ్‌లో నైఫ్‌లు పెట్టి కెళ్ళండి! తేడా వచ్చిందంటే వక్కటే పోటు! అరవకూడదు- కిక్కురుమనకుండా గొంతుపట్టి క్రిందకు తోసెయ్యండి."

వారిద్దరూ అ ప్రయత్నంగా నోరు తెరిచారు. "హత్య.... హత్య... చెయ్యాలా?"

"అంత అవసరం రాదు.. వస్తే రెడీగా వుండండి. అయినా మీ అందం ముందు వారు మోకరిల్లలేదంటే ఒక్కటే అర్థం-వాడు పనికిరాడని. అనవసర విషయాల గురించి ఆలోచించకుండా ధైర్యంగా వెళ్ళండి. మూడో కంటికి తెలియకుండా మీ డ్యూటీ మీరు చెయ్యండి. ఇంతకీ మీ అడ్రస్..."

"వి. చిత్రాంగి, పాత మాంబళం, మైలాపూర్, మద్రాసు...

రెండో ఆమె కూడా గొంతు సవరించుకొని చెప్పింది. "పేరు అప్సర-పాండి బజార్ రాణి లుక్ సెంటర్ దాటాక వచ్చే మొదటి క్రాస్ రోడ్డు.

"పెట్టిన పేర్లో పెట్టుకున్న పేర్లో నాకనవసరం-మీ అడ్రసులకి క్యాష్, వివరాలు అందజేయబడతాయి-మీరు వెళ్ళచ్చు."

వాళ్ళిద్దరూ వెళ్ళిన రెండో నిమిషంలోనే ఆమెని మీదకి లాక్కున్నాడు. ఆమె కిల కిల నవ్వుతూ-

"ఏం ఆ మాత్రం నేను చెయ్యలేనా? నాకు మాత్రం డబ్బుచేదా?"

"డబ్బంటే ఎవరికి చేదూ-నువ్వూ నేనూ కలిసి ఆ రోజు రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తున్నాం మారు పేర్లతో. నీ పేరు తస్లిమా బేగం గుర్తుపెట్టుకో...."

ఆమె రహీమ్‌ని మరింత దగ్గరగా లాక్కుంటూ... "ఇంతకీ ఆ ట్రైన్‌లో ఎవరొస్తున్నారేంటి-కిడ్నాపా లేక రాబరీనా?" అడిగింది.

"నిజంగా నాకూ తెలీదు... మనమిద్దరం ఆ ట్రైన్‌లో మద్రాసు నుంచి ప్రయాణం చేస్తాం... అంతవరకే తెలుసు. ఫర్‌దర్ ఇన్‌స్ట్రక్షన్స్ ఆపై వస్తాయి. వాటి ప్రకారం నడుచుకోవడమే మన పని–ఈ పనికి నాకిచ్చేది మాత్రం ఇరవై లక్షలు".

"ఇరవై లక్షలా? అంటే చాలా పెద్ద వ్యవహారమే. కొంపదీసి ట్రైన్‌లో ఏ ప్రధానమంత్రి అయినా రావడంలేదు కదా? ఆయన్ని మనం..." రహీమ్ తన రెండు చేతులతో ఆమె భుజాలు పట్టుకున్నాడు పూర్తిగా చెప్పనీయకుండా.

భయంగా కళ్ళు పెద్దవిచేసి చెప్పాడు...

"ఇప్పుడడిగితే అడిగావ్! మరెప్పుడూ నోరు జారకు. చాలా పెద్ద వాళ్ళు వెనకున్నారు... ఎందుకో–దేనికో నాకూ తెలీదు కేవలం నిమిత్తమాత్రుడిని... నోర్మూసుకుని పనిచేయటమే మనపని–అనవసరమైన వాటిల్లో ఇంట్రెస్ట్ చూపిస్తే అనుమానం లేకుండా ప్రాణం పోతుంది...."

ఆమె శరీరం వణికింది... రహీమే భయపడుతున్నాడంటే అవతలవారు..?

ఆలోచించలేకపోయింది... ఈలోగా రహీమ్ పూర్తిగా మీదకు లాక్కున్నాడు.

## 2

ఇస్లామాబాద్...

నగరంనుంచి దూరంగా విసిరేయబడ్డట్టుండే ఆ ప్రాంతంలోని ఓ చిన్న ఇరానీ హోటల్....

జనం పలచగా వున్నారు....

క్యాష్ కౌంటర్‌లోని యజమాని చిల్లరని కదిలించుకుంటూ కష్టమర్సు కోసం చూసుకుంటున్నాడు.

కార్నర్ టేబుల్‌మీద రెండు ఖాళీ టీ కప్పులు...ఇద్దరూ దీర్ఘాలోచనల్లో వున్నట్టు తలపంకిస్తున్నారు.

చాలా సేపటి తర్వాత మొదటి అతను దురుసుగా అడిగాడు–

"పనిమాత్రం అవ్వాలి.... ఆ దేశం ప్రపంచదేశాల ముందు తల దించుకోవాలి... వారు ... వారు ఆ దేశంనుంచి బయటకు రాకూడదు. అలాగే మన దేశానికి వ్యతిరేకంగా సంపాదించిన సాక్ష్యాలు కూడా..."

"కోట్లాది రూపాయల ఖర్చు- ఆ డబ్బూ, నా శ్రమ వృథాకాదు"

అతను అసహనంగా తల విదిలించాడు.

"డబ్బు లెక్కలుకాదు అడిగేది... పని... వర్క్-అది ముఖ్యం. భారతీయులుకి అణువణువునా దేశభక్తి వుంటుంది. డబ్బు తీసుకుని పని ఎగ్గొట్టే ఘనులున్నారు... ఆ ప్రతినిధులు భారతదేశం దాటి బయటికి రాకూడదు.

అలా అని పబ్లిక్‌గ్గా ఏ హాని జరగకూడదు.... అంతా ఆ దేశం చేసినట్టే వుండాలి"

అతను కర్కశంగా నవ్వాడు.

"అందుకనేగా ఇంత కష్టపడి ఇంత అద్భుతమైన ప్లాన్‌వేసింది? ప్రపంచదేశాలు ఏవి నమ్మలేని విధంగా, ఆ దేశాన్ని అనుమానించే రీతిలో కిడ్నాప్ చేస్తున్నాను. ఇకపోతే భారతీయుల దేశభక్తి అంటారా ? చాలావరకు క్రిమినల్స్‌నే ఎన్నుకున్నాను. తేడా వచ్చిందంటే ఖయిమా కింద కొట్టి ఆదివారం మార్కెట్‌కి పంపిస్తాను"

"ఇంకా చెయ్యాల్సిన పనులేమైనా మిగిలి వున్నాయా?"

"ఒకే ఒకటి... మన సరిహద్దులలో ఉన్న వాళ్ళని రెచ్చగొట్టి ఓ రెండొందలమందిని తీసుకెళ్ళటం"

"నువ్వేమి చేస్తావో నాకు తెలీదు! ఈ ఆపరేషన్ మొత్తం నీ చేతుల్లో పెడుతున్నాను ఇంటెలిజెన్స్ ఏజెన్సీ వారికి అనుమానం రానీయద్దు... ఇంటర్‌పోల్ కళ్ళల్లో పడద్దు.... అసలిదంతా మనమే చేశాము అనే ఆరోపణ కాదుగదా, అనుమానం కూడా రాకూడదు ఇండియాకి- బి ఎలర్ట్"

"జాగ్రత్త నా ఇంటిపేరు. విజయమే నా పేరు"

రెండో అతను లేచాడు.

"పాయింట్ ఎక్కడన్నావ్" అడిగాడు తనూ లేచి.

"తెనాలి-విజయవాడ మధ్య సర్- అదే అనువు అయిన ప్రదేశము..."

"తెనాలి విజయవాడ మధ్య అంటే ఆరుస్టేషన్‌లు ఉన్నాయి, ఎక్కడ... ఏ పాయింట్‌లో?"

"తెనాలి దాటగానే సర్? తెనాలి తర్వాత స్టేషన్ కొలకలూరు-జస్ట్ పదమూడు కిలోమీటర్లు.... మధ్యలోనే మొత్తం అయిపోతుంది...."

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Rajadhani+Express](http://kinige.com/book/Rajadhani+Express)**

*** * ***